క్లుప్తంగా

శ్రీవేంకటేశ్వర దీక్షలు ప్రారంభం



దీక్ష తీసుకున్న స్వాములు

బోయినపల్లి(చొప్పదండి): తడగొండ గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవేంకటేశ్వర దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో జరిగే స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతీ ఏటా కల్యాణ ఉత్సవాలకు 21 రోజుల ముందు గ్రామ యువకులు స్వామి దీక్ష తీసుకోవడం అనాదిగా వస్తున్న ఆనవాయితీగా గ్రామస్తులు తెలిపారు. ఈనెల చివరి వారంలో బ్రహ్మోత్సవాలు ఐదు రోజులపాటు జరుగుతాయి. పూజారి సాయిశర్మ ఆధ్వర్యంలో స్వాములు దీక్ష తీసుకున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

వీర్నపల్లి: మద్దిమల్ల గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించారు. శివసత్తుల పూనకాలు, బైండ్ల విన్యాసాల మధ్య ఆలయానికి తరలివెళ్లారు. పోచమ్మ తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యాదవ సంఘ కుల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన విప్



విద్యార్థులను అభినందిస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: పదోతరగతిలో సత్తా చాటిన సిరిసిల్లకు చెందిన సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులను శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించారు. పాఠశాల కరెస్పాండెంట్ నాగుల సంతోష్‌గౌడ్‌తోపాటు ఆయన విద్యార్థులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. 10జీపీఏ సాధించిన ఎం.బ్రాహ్మణి, కె.కోమలి, ఆర్.ప్రణతి, ఎం.భవాని, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యపై అధికారుల సర్వే



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: కిష్టంపల్లిలో లోఓల్టేజీ విద్యుత్ సమస్యపై శుక్రవారం సెస్ అధికారులు సర్వే నిర్వహించారు. విద్యుత్ సమస్యలపై మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్ సెస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు తిరుపతి, లక్ష్మీరాజం, వెంకటేష్ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించారు.

మహా ధర్నాను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్, చంద్రమౌళి

గంభీరావుపేట(సిరిసిల్ల)/ఎల్లారెడ్డిపేట: ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా అవమానించినందుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కానాపురం లక్ష్మణ్, మంగళి చంద్రమౌళి కోరారు. ఆత్మగౌరవాన్ని చాటి చెప్పడానికి మాదిగ, మాదిగ ఉప కులాల ప్రజలు ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పీహెచ్‌సీలో సేవలు అంతంతే..



వైద్యాధికారి రాకపోవడంతో ఖాళీగా కుర్చీ



వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

- చందుర్తిలో పేరుకే 24 గంటల వైద్యం
- సమయపాలన పాటించని సిబ్బంది
- వైద్యుల కోసం రోగుల ఎదురుచూపు

చందుర్తి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్ధరాత్రి, అపరాత్రి అన్న తేడా లేకుండా వైద్య సేవలను అందించేందుకు ఏర్పాటు చేసిన 24 గంటల వైద్య సేవలకు నిర్లక్ష్యపు జబ్బు అంటుకుంది. ఇక్కడ 24 గంటల వైద్య సేవలు మాట దేవుడెరు.. కనీసం 4 గంటలపాటు సేవలందించేందుకు వైద్య సిబ్బందికి ఓపిక లేకుండా పోయిందన్న విమర్శలు మండల కేంద్రంలో వినవస్తున్నాయి.

ఇష్టారాజ్యం..

వైద్య సేవల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చే రోగులు ప్రతిరోజు వైద్యుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఉదయం 9 గంటల వరకే ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాల్సిన వైద్యాధికారులు అతిథుల్లాగా విధులకు ఇష్టానుసారంగా హాజరవుతున్నారన్న ఆరోపణలున్నాయి. సమయపాలన పాటించాల్సిన వైద్య సిబ్బంది వారి ఇష్టానుసారంగా ఆరోగ్య కేంద్రానికి వచ్చి వెళ్తున్నారు. దీంతో రోగులను కొన్ని సమయాల్లో వైద్యులకు బదులు ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)లు పరీక్షలు చేస్తూ మందులు రాస్తున్నారు. కొన్నిసార్లు రోగులు డాక్టర్లు లేరని అనుమానాలు వ్యక్తం చేస్తున్నా.. వారిని డాక్టరేనని నమ్మబలికి మందులను ఇస్తూ ఇంటికి పంపిస్తున్నారు. వైద్యులు శాఖాపరమైన పనుల నిమిత్తం బయటకు వెళ్తున్నారని అనుకుందామనుకుంటే.. ఒకటి, రెండుసార్లయితే ఫర్వాలేదు కానీ.. వారం రోజుల్లో నాలుగు రోజులు డాక్టర్లకు బదులు(ఎంఎల్‌హెచ్‌పీ) మందులు రాస్తున్నాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించాల్సిన వైద్య ఉన్నతాధికారులు జిల్లా కేంద్రానికి పరిమితం కావడంతో ఈ దుస్థితి నెలకొందని ప్రజలు విమర్శిస్తున్నారు.

సాయంత్రం దుమ్మా...

ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఓపీ చూడాల్సిన వైద్యాధికారులు 2 గంటల వరకే ఆరోగ్య కేంద్రం నుంచి ఇంటిదారి పడుతున్నారు. వైద్యాధికారి తరువాత ఒకరి తర్వాత ఒకరు 3 గంటల వరకు ఆరోగ్య కేంద్రం నుంచి వెళ్లిపోతున్నారు. ఒక్కోసారి తెరిచి కేంద్రంలో ప్రథమ చికిత్స చేసేందుకు స్టాఫ్ నర్సులు కూడా లేక వేములవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్తున్నారు. వీరందరిపై నిఘా ఉంచాల్సిన వైద్యాధికారులే సమయపాలన పాటించనప్పుడు.. కిందిస్థాయి సిబ్బందితో పనులు చేయించే దెవరన్న సందేహాలు పట్టి పీడిస్తున్నాయి.

ఉదయం పూటే తనిఖీలు

వైద్యాధికారులు, సిబ్బంది పనితీరు తనిఖీ చేస్తే బయటపడుతుంది. కానీ ఉదయం పూటే తనిఖీలు చేస్తూ జిల్లా వైద్య ఉన్నతాధికారులు చేతులు దులుపుకోవడంతో.. తనిఖీకి రారన్న ధీమాతోనే సాయంత్రం నుంచి మళ్లీ ఉదయం దాకా సేవలు అంతంత మాత్రంగా అందిస్తున్నారు.

కాళ్లు, చేతులు గుంజుతున్నయని వచ్చిన



కాళ్లు, చేతులు గుంజుతున్నయని డాక్టరుకు చూపించుకుందామని దవాఖానాకు వచ్చిన. గంటకు పైగా ఎదురుచూసినా డాక్టరు మాత్రం ఇంకా రాలేదు. డాక్టర్ వచ్చేంతవరకు ఉండి చూపించుకుని పోతనని కూర్చున్న. ఇక్కడ ఉన్నవాళ్లు మేమే గోలీలు ఇస్తామంటే తీసుకోలేదు.

– తిప్పని లచ్చవ్వ, రామన్నపేట, చందుర్తి

షుగర్ టెస్టు చేయించుకుందామని..



నెలనెలా వచ్చి ఇక్కడే షుగర్ టెస్టు చేయించుకుంటున్న. ల్యాబ్ టెక్నీషియన్ ఇంకా రాలేదు. ఉదయం 9 గంటలకు వచ్చిన. 10 గంటలైనా ఇంకా రాలేదు. టెస్టులు చేయించుకొని గోలీలు తీసుకుపోతా. ఎప్పుడు వచ్చిన వైద్య సిబ్బంది కోసం వేచి చూసుడే ఉంది. సమయానికి వచ్చి వైద్య సేవలు అందిస్తే మాకు ఇబ్బందులుండవు.

– రొండి చంద్రయ్య, మల్యాల, చందుర్తి

ఎప్పడచ్చినా ఎదురుచూసుడే..



పాణం సాత కావడం లేదు. జ్వరమొచ్చినట్లుగా ఉందని డాక్టర్‌కు చూపించుకుందామని వచ్చిన. కానీ వైద్యులు ఇంకా దవాఖానాకు రాలేదని వారి కోసం చూసుకుంటూ కూర్చున్న. డాక్టర్ వచ్చినంక చూపించుకుని గోలీలు తీసుకుపోతా. ఎప్పుడచ్చినా డాక్టర్ల కోసం ఎదురుచూసుడే ఉంది.

– ఆకుల గంగరాం, లింగంపేట, చందుర్తి

వైద్య సేవలు అందుతున్నాయి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్నాయి. వైద్య సిబ్బంది అందరూ అందుబాటులోనే ఉంటున్నారు. మొన్నటివరకు పిల్లలకు ఉదయం పూట పాఠశాల కావడంతో వారు ఆరోగ్య కేంద్రానికి రావడం ఆలస్యమైన మాట వాస్తవమే. ఇక పిల్లలకు వేసవి సెలవులు వచ్చాయి. ఇకనుంచి సమయపాలన పాటించేలా చర్యలు తీసుకుంటా. ల్యాబ్ టెక్నీషియన్ లేక బయటనుంచి తీసుకొస్తున్నాం. ఈ పోస్టు ఖాళీగా ఉంది.

– డాక్టర్ సంపత్, వైద్యాధికారి, చందుర్తి

సిరిసిల్ల సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



బోయినపల్లి కాంగ్రెస్ నాయకులు

బోయినపల్లి: జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి జన జాతర సభకు మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం తరలారు.

రుద్రంగి: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో జన జాతర సభకు మండల కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లాయి. జెడ్పీటీసీ గట్ల మీనయ్య, ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ తదితరులున్నారు.

తంగళ్లపల్లి: సిరిసిల్లలో జరిగిన సభకు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని, నాయకులు నేరెళ్ల నర్సింగంగౌడ్, లింగాల భూపతి, శ్రీనివాస్, మోర రాజు, మచ్చ శ్రీనివాస్, వైద్య శివప్రసాద్, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, మిరాల శ్రీనివాస్‌యాదవ్, పెద్దూరి తిరుపతి, బైరి రమేశ్, పర్శరాములు, అరెపల్లి బాలు తదితరులున్నారు.

ముస్తాబాద్: సీఎం సభకు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో యువకులు, రైతులు, మహిళలు వెళ్లారు.

వేములవాడఅర్బన్: మండల కాంగ్రెస్ నాయకులు జిల్లాలోని సీఎం సభకు పెద్దఎత్తున తరలివెళ్లారు.

వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు జన జాతర సభకు వెళ్లారు.

రేపు మల్యాలలో బీఆర్ఎస్ బహిరంగ సభ



మల్యాలలో సభాస్థలాన్ని పర్యవేక్షిస్తున్న నాయకులు

చందుర్తి: మల్యాల గ్రామ శివారులో ఈనెల 5న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను నాయకులు శుక్రవారం పర్యవేక్షించారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ తరఫున ప్రచారానికి సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు రాకతో సభకు 10వేల మందిని తరలించాలని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య తెలిపారు. నాయకులు గూడూరి ప్రవీణ్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, నాయకులు ఈర్లపెల్లి రాజు, బైరగోని రమేశ్, పోతురాజు నగేశ్, మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కవ్వంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఇల్లంతకుంట నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ రేపాక గ్రామ మాజీ అధ్యక్షుడు అరుకాంతం ఆనందరెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు ఏట్ల రాజు వారి అనుచరులకు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇల్లంతకుంట ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్య, నాయకులు పాల్గొన్నారు.

రేపు మున్నూరుకాపు సంఘం సమావేశం

వేములవాడ: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఈనెల 5న ఉదయం 10 గంటలకు వేములవాడలోని మున్నూరుకాపు సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులందరి సమక్షంలో మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ విధివిధానాలు ఆమోదించడం జరుగుతుందన్నారు. వేములవాడ శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో మున్నూరుకాపుల గురించి మాట్లాడారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లా, మండల, గ్రామ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిథిగా విప్ హాజరవుతారన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండల ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా అజీమోద్దీన్, ఉపాధ్యక్షులుగా మారోజు కుబేరస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెంజర్ల తిరుపతియాదవ్, కోశాధికారిగా నాగుల శ్రీధర్, సహాయ కార్యదర్శిగా హరీష్, సలహాదారులుగా ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, ఫక్రుద్దీన్, షాదుల్, సభ్యులుగా రాజు, నరసింహాచారి ఎన్నికయ్యారు.

గంజాయి పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. సిరిసిల్ల పట్టణ శివారులోని శాంతినగర్‌కు చెందిన గూడూరి సాయికిరణ్ అనే యువకుడు కొంతకాలంగా గంజాయిని విక్రయిస్తున్నాడు. స్థానికంగా సాయికిరణ్ గంజాయిని అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేసి నిందితుడి వద్ద నుంచి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు నిందితున్ని అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

నేతన్నల ఆత్మహత్యకు కాంగ్రెస్‌దే బాధ్యత



మాట్లాడుతున్న సబ్బని హరీష్

సిరిసిల్లటౌన్: నేతన్నల ఆత్మహత్యకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించిన తర్వాతే ఓట్లు అడగాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిరిసిల్లలో నిర్వహించిన ప్రెస్ మీట్లో మాట్లాడారు. ఉపాధి లేక, కుటుంబాలను పోషించుకోలేని చనిపోతే పట్టించుకోని సీఎంకు సిరిసిల్ల నేతన్నల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. నాయకులు సాయిదీపక్, వెంకటరమణ, శ్రీనాథ్, విజయ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం



రుద్రంగి: ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ నాయకులు



ముస్తాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

రుద్రంగి: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని మండల బీజేపీ నాయకులు శుక్రవారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కర పత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థించారు. ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి బండిని గెలిపించాలని కూలీలను కోరారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్ మాట్లాడుతూ.. మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలిపారన్నారు. నాయకులు రవీందర్, గణేశ్, రాజు, శ్రీహరి, నితిన్, సురేశ్, నవీన్, మధు, బాల్‌రెడ్డి, గంగాధర్, నరేశ్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: దేశ రక్షణకు, దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రధాని మోదీ గ్యారంటీ అని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ అన్నారు. ముస్తాబాద్, బందనకల్, నామాపూర్, చిప్పలపల్లి, చీకోడు గ్రామాల్లో అభ్యర్థి బండిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. నాయకులు సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సంజీవ్, వెంకటేశ్, రాజు, రమేశ్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని, సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. అక్కపల్లి, దుమాల గ్రామాల్లో శుక్రవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు మినహాజ్‌ఖాన్, సత్యంరెడ్డి, లక్ష్మారెడ్డి, కిరణ్ నాయక్, రామచంద్రం, మానుక కుమార్, కరుణాకర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, నంది నరేష్, అంజి, కిరణ్‌నాయక్, గణేశ్, శ్రీశైలం, రామచంద్రారెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'వెలిచాల'ను భారీ మెజార్టీతో గెలిపించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని లోక్‌సభ నియోజకవర్గ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి కోరారు. గూడూరు, గూడెం, ఆవునూర్ గ్రామాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, నాయకులు మిర్యాల్‌కార్ శ్రీనివాస్, ఎల్లాగౌడ్, అంజన్‌రావు, రాంరెడ్డి, ఎల్లం, బాలయ్య, శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి కోరారు. అక్కపల్లి, గుండారం, తిమ్మాపూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో శుక్రవారం వారు రాజేందర్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు మహేందర్, లింగంగౌడ్, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, కార్తీక్‌గౌడ్, పర్శరాములు, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్‌గౌడ్, గిరిధర్‌రెడ్డి, రాములు, చెన్ని బాబు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



అక్కపల్లిలో ప్రచారం చేస్తున్న ఆగయ్య



మెదక్ చర్చిలో బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. అక్కపల్లి, రాచర్లగొల్లపల్లి, తిమ్మాపూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పర్శరాములుగౌడ్, సందీప్, లక్ష్మణ్, హసన్, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ గెలవాలని గంభీరావుపేట మండల బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మెదక్ చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. గడ్డి హరీష్, ఎడబోయిన రాజు, ద్యానబోయిన రాజు, ఎగదండి రవి తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంటం నాగరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బంజారా సేవాలాల్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ బోయిని రవి, చాంద్ పాషా, లింబాద్రి, శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన నాయకులు



ఎంపీ బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

కోనరావుపేట: నిజామాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎంపీ బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ ముష్కం నందయ్య, కోరవేణి రాజయ్య, కచ్చకాయల వేణు, మల్లేశం, నరేశ్, బుక్క విశ్వనాథం, మామిడిపల్లి శ్రీనివాస్, తంగళ్లపల్లి రాములు, గడ్డం మధు, 30 మంది కార్యకర్తలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మండలాధ్యక్షుడు గొట్టె రామచంద్రం, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, వెలిశాల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, కిషన్, తిరుపతి, భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.